# ఇలా జరిగితే...!

## ఉద్యోగికి దూరభూమి లేదు.

నిజమే. తిరిగిన వూరు తిరక్కుండా, వున్న చోట వుండకుండా రాష్ట్రంగాని రాష్ట్రాల్లో పాతికేళ్ళు పనిచేశాను.

అవును- పాతికేళ్ళు! ఇంతకాలమూ దేశమంతా నాదై పోయింది. అన్నివూళ్ళల్లోనూ ఇదే జనం: ఇదే మనం. ఎక్కడా ఎప్పుడూ నేను ప్రవాసినన్న భావమే రాలేదు.

మళ్ళీ ఇన్నేళ్ళకి పుట్టిన గడ్డకి చేరుకుంటున్నాను.

తార్రోడ్డుని కొలుస్తూ- బస్ ముందుకు సాగుతోంది.

కండక్టర్ అరిచేడు, "రంగాపురం దిగేవాళ్ళు ముందుకు రండ "ంటూ

నేను సీట్లోంచి లేచేను. తూలిపడబోయి నిలదొక్కుకున్నాను. సూట్‌కేస్ పట్టుకుని నిమ్మళంగా ముందుకువచ్చి కండక్టర్ సీటుపక్కగా నిలబడ్డాను.

బస్ ఆగింది. నేను దిగేను. బస్ వెళ్ళిపోయింది.

చింతచెట్టు క్రిందగా పక్కగా 'నాయర్ కాఫీ హోటల్' దర్శన మిచ్చింది. టేపురికార్డర్‌లో మళయాళం పాటలు వినిపిస్తున్నై.

కాంతికిరణం అద్దంమీదపడి చమక్కుమన్నట్లయింది. చుట్టూ పరిశీలనగా చూశాను.

చల్లదనంతో పులకిస్తూ మబ్బులు ఆకాశంలో కదుల్తున్నై. చిన్నచిన్న పిట్టలు పల్టీలు కొడుతూ ఎగురుతున్నై. పడమటి దిక్కున వరదగుడేసింది. కమ్మ తెమ్మెర దేహాన్ని తాకి చల్లగా జారుకుంది.

ఎదురుగా మాఊరు పోయే రోడ్డు చేతులుసాచి ఆహ్వానిస్తున్నట్టు పరచుకునివుంది. ఇంచక్కా నల్లటి తారురోడ్డు !

"ఊళ్ళోకి రోడ్డుపడింది" అనుకుంటుంటే సంబరంతో మనసు మురిసిపోయింది.

ఉన్నట్టుండి మనసు పరితప్తం అయింది. పాతికేళ్లమునుపు జరిగిన సంఘటనల్ని నెమరు వేసుకోసాగింది మనస్సు.

అప్పట్లో ఇక్కణ్ణుంచీ ఊరుదాకా డొంక. మట్టిరోడ్డు. వాన కురిస్తే మోకాలిలోతు బురద. ఎడ్లబండికూడా నడవదు. దానికితోడు_ రెండుమైళ్ల దూరంలో కుందేరు. అది పొంగి ఊరికీ బయటి ప్రపంచానికీ సంబంధం లేకుండా చేసేది.

నాకు ఆ సంఘటన నిన్నమొన్న జరిగినంత విశదంగా గుర్తు.

అక్కయ్య పురిటి కొచ్చింది. వానాకాలం. ఆరాత్రి– నొప్పులు రావడం ప్రారంభం కావడమేమిటి- వానజల్లా మొదలైంది. నడిరాత్రి గడిచేసరికి జల్లు కాస్తా జోరువానగా మారి ఆకాశానికి చిల్లులు పడ్డట్టు మిన్నూ మన్నూ ఏకం చేయసాగింది. అక్కయ్యకు కానుపు ఇబ్బందయింది. తనవల్లకాదు, పట్నం తీసుకుపొమ్మని కాళ్ళ బార్లాపాదింది, మంత్రసాని. గూడు బండిలో ఎక్కించి అతి కష్టంమీద కుందేరుదాకా వచ్చాం. ఏరు పొంగివుంది. బండి వెనక్కి తిరిగి వూర్లోకొచ్చేసరికి, అక్కయ్య ఈ లోకాన్ని విడిచిపోయింది. ఆ దిగులుతోనే అమ్మ మంచమెక్కింది. ఏడాది తిరిగేలోగానే ఆమె కూడా నాకు దూరమైంది.

ఆ తర్వాత- వున్న చారెడు కుంటా అమ్మేసి ఇంటిని మాత్రం సీతారామయ్య బాబాయి వాళ్ళని వాడుకోమని నేను పట్నానికి వెళ్ళిపోయాను.

వెనకటి తరంలో ఎంతమంది ఈ రోడ్డుకోసం ఎన్నెన్ని కలలు కన్నారో!

గట్టిగా వూపిరిపీల్చుకున్నాను. అడుగు ముందుకు వేశాను.

ఊళ్లోనుంచీ రిక్షాలు వస్తున్నై- పాలకేన్లతోనూ, మనుషులతోనూ. పాలు- పట్నం పోతున్నాయన్నమాట.

నాలుగు ఫర్లాంగులు నడిచేసరికి రోడ్డువారగా [illegible] [illegible] దర్శనమిచ్చింది. ముందునా పెద్దబోర్డు. [illegible]

ప్లాట్ఫారమ్". దానికి అల్లంత దూరంలో శివుడిగుడి కనిపిస్తోంది. ఆ గుడిచుట్టూ- అప్పట్లో- శివరాత్రి తిరణాల జరుగుతూ వుండేది.

రోడ్డుకు అటూఇటూ అరటితోటలూ, అవిశా, తమలపాకులూ కలిసిన తోటలూ- పచ్చగా, గాలికి ఊగుతున్నై.

నడుస్తున్న వాణ్ణి ఠక్కున ఆగేను. స్పృహలోకొచ్చిచూస్తే వంతెన మీద నిలబడి వున్నాను. అవును-కుందేరు మీద వంతెన! అటూ ఇటూ రైలింగు మా వూహల్లో మాత్రమే ప్రత్యక్షమై, మనకిది గగనకుసుమంలే అనిపించిన వంతెన !

ఆనందంతో మనసు గంతులు వేసింది. చిన్న పిల్లవాడిలా వంతెనకి అటూ ఇటూ పరిగెత్తుతున్నాను. రైలింగ్ని పట్టుకుని ఉయ్యాల లూగుతున్నాను. తలెత్తి ఆకాశంలోకి చూస్తూ పాటలు పాడేస్తున్నాను: కాళ్లు విదిలిస్తూ, చేతులు గాలిలో తిప్పుతున్నాను. గాలి కెరటాలమీద తేలిపోతున్నాను.

స్వప్నం నుంచీ బయట పడ్డట్టు ఈ లోకంలోకి వచ్చాను. వంతెన కిందుగా ఏరులో కాళ్ళు మొహం కడుక్కుంటున్న పడుచు పిల్ల నన్నుచూసి కిలకిలా నవ్వుతోంది.

అప్పటివరకూ తనచూపుల్తోనే ఆమె నన్ను కొలిచిందనే తెలివిరాగానే, సిగ్గుపడ్డాను. ఎగాదిగా ఆమెకేసి చూశాను. కుచ్చెళ్ళు ఎత్తి పట్టుకొని జాగ్రత్తగా కాళ్ళు కడుక్కుంటోంది. కాలిపట్టాగొలుసులు మెరుస్తున్నై. నీటి తాకిడికి స్వచ్ఛమైన పాదాలు పచ్చగా మిసిమి చిందుతున్నై.

ఆమెలేచి గట్టుమీదకు వచ్చింది. పైటకొంగుతో మొహం తుడుచుకుని గట్టుమీద వున్న పుస్తకాల దొంతరని చేతుల్లోకి తీసుకుంది. ముందుకు కదిలి, దగ్గరగా వచ్చింది. తేరిపార చూశాను. ఆమె పైటకొంగును మునిపంటితో కొరుకుతోంది. మనిషి ముడుచుకుపోతూ పక్కగా అడుగేసింది.

నాలో ఏో మూల బుద్ధిదీపం వెలిగింది. రామసుబ్బయ్య కూతురు వరలక్ష్మి ! " వరం " అన్నాను.

ఆగి వెనక్కి చూసింది. ఆశ్చర్యంతో కళ్ళు మిటకరించింది. నేను ప్రవర చెప్పుకున్నాను. " నువ్వా " అంది, నిమ్మళంగా. ఇద్దరమూ కదిలేం. వంతెన చివరికి వచ్చేము.

నేను వంతెన స్తంభాలకు వున్న రాతిపలకల్ని పరిశీలిస్తూ నిలబడ్డాను. దాని నిర్మాణానికి విరాళాలిచ్చిన వాళ్ళపేర్లు వున్నై. వాటిల్లో ఎవ్వరూ నాకు తెలీదు.

కబుర్లు చెప్పుకుంటూ నడక సాగిస్తున్నాం.

"అమ్మా నాన్నా బాగున్నారా?" అడిగేను యధాలాపంగా.

కొద్దిసేపు తటపటాయించి చెప్పింది, " నాన్న పోయి ఎనిమిదేళ్ళయింది. " ఆమె కంఠం వణికింది. నేనూ బాధపడ్డాను. రామసుబ్బయ్య బాగా మోతుబరీ ఆసామి. పాడికీ పంటకీ, సిరికీ సంపదకూ కొదవలేని కుటుంబం. ఆరుగురూ ఆడపిల్లలే ఆయనకి. వరలక్ష్మి నాలుగోపిల్ల. తను పక్కవూళ్ళో హెల్త్ విజిటర్ గా పని చేస్తోందిట.

ఊళ్ళోకి రాబోతుండగా కనిపించింది– హైస్కూల్ బిల్డింగ్ ఇద్దరమూ ఆగేము. చాలా విశాలమైన ఆవరణలో, అందంగా వుంది భవంతి.

" ఇక్కడ మీ వాములదొడ్డి వుండేదికదూ ? " లీలగా గుర్తుచేసుకుంటూ అడిగేను. " అవును. నాన్న ఈ స్థలాన్ని విరాళంగా ఇచ్చేశారు. "

బోర్డుకేసి చూశాను. పైకి చదివేను " మంగళాసులకర్ణి మెమోరియల్ హైస్కూల్ " " ఎవరూ " అన్నాను, " మన ఊళ్లో డాక్టర్‌గారు. ఆయనకు భార్య లేదు. ఆమెపేరు మీద నాలుగులక్షలిచ్చారు. "

నేనీ వూళ్లో వున్నప్పుడు ఈ డాక్టరుగారు లేడు !

–ఊళ్ళో కొచ్చాం.

మొదట్లోనే అంగడి వీధి. షాపులన్నీ కళకళలాడుతూ వింతగా కన్పిస్తున్నై. అన్నీ షోకేసుల్ని సంతరించుకున్నై. డెకొలామ్ మహత్యం ప్రతికొట్లోనూ కనిపిస్తోంది. ఉడిపిహోటల్ కిటకిటలాడుతోంది. ఆ పక్కనే " పాయ్ మెడికల్ హాల్ " కూడా రద్దీగానే వుంది.

" నవ్వీన వూరు పట్నమైంది " అన్నాను. తీర్చిదిద్ది నట్లున్న రోడ్లకేసి చూస్తూ. కరెంటు దీపాలు వెలిగినై.

" ఊరు చాలా మారిపోయింది " అనుకుంటూ సెంటర్లో ఆగేను. " నే వస్తా అయితే " అంటూ పక్కబజార్లోకి వెళ్ళిపోయింది. వరలక్ష్మి.

ఉన్నట్టుండి నా కుడికన్ను అదిరింది. హఠాత్తుగా మేధస్సులో ఒక ప్రశ్న మెదిలింది; " వరలక్ష్మి అలా వెళ్ళిపోయిందేం ? మాటవరసకైనా వాళ్ళింటికి రమ్మని ఆహ్వానించలేదేమిటి " అనిపించింది.

ఆలోచనలతోనే కాళ్ళని మా వీధికేసి కదల్చాను. మా యింటికి పక్కగా " ఎలక్ట్రానిక్స్ " షాప్ వెలిసింది. టేప్ రికార్డర్లూ, రేడియోలూ మోగుతున్నై.

—బాబాయి, పిన్నీ, పిల్లలూ నా రాకకు చాలా సంతోషించారు. తెచ్చిన వస్తువులు ఇచ్చాను.

కాఫీ తాగి ఊళ్ళోకి వెళ్ళొస్తానని బయల్దేరాను.

మలుపు తిరగడంతోటే " కులకర్ణి నర్సింగ్ హోమ్ " భవంతి కనిపించింది. చాలామంది పేషంట్స్ వున్నారు. చుట్టుప్రక్కల గ్రామాలన్నిటికీ ఈ వూరే పట్నమైందనిపించింది.

రామసుబ్బయ్యగారింటికి దారితీసినై నా కాళ్ళు.

వెళ్ళాను. నేను వసారా మెట్లెక్కుతూవుంటే, రామసుబ్బయ్య భార్య రత్తమ్మ నన్నుచూసి కళవళపడింది. లేచి " అమ్మాయి చెప్పింది, రా... రా..." అంటూ ఆహ్వానించింది.

వసారాలో బల్లమీద కూర్చున్నాను.

కుశలప్రశ్నలు అయినై. నేనూ ఆయన పోవడం గురించీ ఇతర విషయాలూ ప్రస్తావించాను.

ఆమె చెప్పింది, నలుగురుపిల్లల పెళ్ళిళ్ళతో సిరిసంపదలు జారుకున్నై. "ఆయన మరణం అశనిపాతమే అయితే, పెళ్లయిన

ఆర్నెల్లలకే వరలక్ష్మి పసుపు కుంకుమల్ని పోగొట్టడం ఆ దేవుడి లీల ” అని కంటతడిపెట్టుకుంది.

నేను ఉలిక్కిపడ్డాను. గుండె దడదడ లాడింది. మనస్సులో సన్నగా బాధ ప్రారంభమైంది. వరలక్ష్మి నన్ను ఇంటికి ఎందుకు పిలవలేదో అర్థమైంది.

“ పరిస్థితులు మారినై. వరలక్ష్మి ఉద్యోగం చేయడం తప్పనిసరయింది. దాని అత్తగారు వాళ్లు దానిబాధ్యతనివది లేశారు. అదీ ఈ యింటికే వచ్చేసింది. చివరి పిల్లలు కాలేజీలో చదువుతున్నారు. ” అన్నది రత్తమ్మ.

ఆడపిల్లలకి కాలేజీ చదువు! భర్తపోయిన స్త్రీ ఆ దుఃఖాన్ని మరచిపోవడానికీ, తన కాళ్లమీద తను నిలబడటానికీ– ధైర్యంగా ఉద్యోగం చేయడం ! అందునా తాను విగత భర్తృకననే సూచనలు కనపడకుండా మసలుకోవడం !

నిజంగానే మా వూరు మారిపోయింది! దేశమంతా తిరిగి తిరిగి, పట్నాలు మాత్రమే ముందుకు పరిగెత్తుతున్నాయనుకున్న నాకు- కాదు కొన్ని పల్లెలూ ముందుకే చూస్తున్నాయనే వాస్తవం అవగతమైంది.

తిరిగి వస్తూ చెరువు గట్టు చుట్టూ తిరిగేను. అక్కడో చిన్న నెహ్రూ పార్కు వెలిసింది.

దారిలోనే వెంకటరత్నం మాష్టారిఇల్లు. వెళ్లాను. ఆయనకి బాగా వార్ధక్యం వచ్చేసింది. స్కూలు కబుర్లు చెప్పాడు. దేశం

నలుమూలలనుంచీ వచ్చిన టీచర్లు వున్నారట. వచ్చే ఏడాది జూనియర్ కాలేజ్ అవుతుందట. ఆయన కొడుకు బొంబాయిలో ఏదో కంపెనీలో కెమిస్టుగా పనిచేస్తున్నాడుట.

నా రాకకు కారణం అడిగేడు. చెప్పాను. "ఇల్లుపాడై పోతోంది ఒకసారి వచ్చి చూసి పొమ్మని గొడవపెట్టున్నారు, పిన్ని బాబాయీ. వీలైతే ఎవరికన్నా అమ్మేసి పోదామని వచ్చాను. కానీ..." అని అర్ధోక్తితో ఆపి, సంభాషణని వాళ్ల అబ్బాయి మీదికి మళ్లించాను.

ఇంటికి తిరిగివచ్చి మాటల్లో పడ్డాను. ఆ తర్వాత, బాబాయి ముందు నా సందేహాన్ని బయట పెట్టాను. "మన ఊరికి నిజంగానే దశతిరిగింది. ఇంత అభివృద్ధి ఎలా సాధ్యమైందా అనేదే అర్థం కావటల్లేదు." అన్నాను.

బాబాయి నవ్వేడు. "అవును. సినిమాలో చూపితేనో, కథలో చదివితేనో తప్పకుండా అవాస్తవికం అనేంత పనిజరిగింది క్కడ దీనికంతకీ కారణం గ్రామస్థుల పెద్దమనసు, సమన్వయ దృష్టి. పొరుగు రాష్ట్రం నుంచీ డాక్టర్‌గారు వచ్చి ప్రాక్టీస్ పెట్టిన రోజున వూళ్ళో నలుగురూ నాలుగు పిధాల మాట్లాడారు, కానీ, ఆ తర్వాత– ఆయనే ఈ వూరికి గార్డియన్‌గా మారేడు. మన వూరికి ఆయనే సర్పంచి కూడా. ఔదార్యం, మంచితనంవున్న ప్రతి మనిషినీ కులం,మతం, ప్రాంతం–అనే తత్వాలు లేకుండా తనలో కలుపుకునేందుకు తాను అభివృద్ధి చెంది, తనవాళ్ళని అభివృద్ధి చేసేందుకూ– విశాలమైంది ఊరు. అంతే. నా చిన్నప్పుడు అన్నిటా ఇరుగ్గా వుండేది."

ఆయన చెప్పింది నిజమే ననిపించింది.

నాయర్ కాఫీహోటల్; దేశ్‌పాండే పౌల్ట్రీఫారమ్; ఎలక్ట్రానిక్ షాపులూ, కులకర్ణీ నర్సింగ్‌హోమ్, మంగళాకుల కర్ణీ మెమోరియల్ హైస్కూల్, కుందేరు మీద ఎందరో విరాళాలతో కట్టిన వంతెన, పయ్ మెడికల్‌హాల్, ఉడిపీహోటల్— అన్నీ కళ్ళముందు మెదిలినై.

“ అవునూ, ఇన్ని సౌకర్యాలూ వుండి, నీటికుళాయిలు రాలేదేం ! ” అంటూ అడిగేను.

బాబాయి సన్నగా నవ్వేడు. “ నువ్ మళ్లీ ఈ వూరొచ్చే సరికి నీటికుళాయిలూ స్వాగతం పలుకుతై; ఇంజనీరు రఘురామన్ నిన్ననే చూసి వెళ్లారు. నీయిల్లూ ముస్తాబౌతుంది. ఆ శుభవేళ వీధిలో సన్నాయి మ్రోగుతుందిలే ” అని కొంటెగా నా కళ్లల్లోకి చూసేడు.

నా కలల వృత్తాంతం బాబాయికెట్లా తెలుసా? అని విస్తుపోయాన్నేను.

ఎదుటి వాళ్ల మనోనేత్రంలోని దృశ్యాల్ని చూసే స్ఫూర్తి-పండిన అనుభవం గడించిన శక్తి కాబోలు మరి !

బలిపీఠం నవలా, కందుకూరి రూపం— నా కళ్ళల్లో మెదిలాయి !!

$_0{}_0{}^0$